# ముక్తి మార్గము

## నా ప్రియమైన మిత్రమా !

బహుశా నీవు ఎప్పుడూ ఆలోచించని, ఎవరూ నీతో మాట్లాడని అతి ప్రాముఖ్యమైన విషయాన్ని నీతో పంచుకోవాలని ఆశగా ఉంది. దయచేసి కొంత సమయాన్ని నా కొరకు కేటాయించవా? అసలు నేను ఎవరు? ఎక్కడ నుండి వచ్చాను? ఈ భూమిపై ఏమి చేస్తున్నాను? ఎందుకు చేస్తున్నాను? నా జీవిత ఉద్దేశ్యం ఏమిటి? మరణిస్తే నేను ఎక్కడకు వెళతాను అనే మౌళిక విషయాలు గురించి ఎప్పుడయినా ఆలోచించావా? మానవ హృదయంలోని వెలితికి, అసంతృప్తికి, దుఃఖానికి కారణం ఏమిటి? డబ్బు, ఉద్యోగం, అందం, ఆస్తి ఏవియు మానవునికి నిజమైన ఆనందం శాంతి, సమాదానం, ఆనందం ఇవ్వలేకపోతున్నాయి. అసలు మానవుని అత్యున్నత అవసరత ఏమిటి? తన హృదయంలోని వెలితిని అసంతృప్తిని పూడ్చటానికి మానవుడు ఎన్నో వ్యసనాలకు అలవాటుపడి ఎన్నో పనులు చేస్తున్నప్పటికీ తాను కోరుకున్న ఆ ఆనందం, శాంతి, సమాదానం, సంతృప్తి ఎందుకు పొందలేకపోతున్నాడు? తల్లి కోసం ఏడ్చే పసి పిల్లవాడు మరి ఏ ఆట బొమ్మతోను తృప్తిపరచబడని విదంగా, ఒడ్డున పడ్డ చేప నీటితో తప్ప మరి దేనితోనూ తృప్తిపరచబడని విదంగా, దేవుని ఊపిరి ద్వారా తయారు చేయబడ్డ ఆత్మ అయిన మానవుడు తన ఆత్మీయ తృష్ణను ఆత్మ దాహమును భౌతికపరమైన విషయములతో తృప్తిపరచకొనలేడు.

ధనవంతుడు, పేదవాడు, పండితుడు, పామరుడు ఎవరైనా సరే ఒక రోజు మరణాన్ని ఎదుర్కోవాలి అనే భయం అంతర్లీనంగా కలిగియున్నాడు. ఒకడు ఈ లోకంలో సమస్తమును సంపాదించుకొని తన ప్రాణము కోల్పోతే వానికి ఏమి ప్రయోజనము! మరణం ఒక మర్మంగాను, చిక్కుముడిగాను

ఉంది కదా! మరణం తరువాత మానవుని పరిస్థితి ఏమిటి? ఒక్కొక్కరు ఒక్కొక్క సిద్ధాంతము కలిగియున్నారు. ఏది సత్యం?! ప్రతి ఒక్కరు ముక్తి కొరకు ఎంతో ప్రయాసపడుతున్నారు. మనిషి జీవితం నీటి ఆవిరి వంటిది కాదా. ఎప్పుడు ఏమి జరుగుతుందో నీకు తెలుసా. అందుకే మరణించే లోపు కొన్ని అతి ప్రాముఖ్యమైన విలువైన జీవిత సత్యాలు మనము తెలుసుకోవాలి. కదా మిత్రమా!?

**మానవుడు ఎవరు :**

మానవుడు దేవుని పోలికలోను, దేవుని స్వరూపములోను సృష్టింపబడిన ఒక ఆత్మ స్వరూపి,ఒక నైతికజీవి. తనకున్న మనస్సాక్షిని బట్టి ఏది మంచిదో ఏది చెడ్డదో తెలుసుకోగలిగే వివేచన కలిగినవాడు. కనుక తాను చేసే ప్రతి పనికి, మాట్లాడే ప్రతిమాటకి జవాబుదారిగా ఉంటాడు. జంతువులకు, పక్షులకు ఆత్మ ఉండదు. మనస్సాక్షి ఉండదు. కనుక మంచి చెడుల విచక్షణ జ్ఞానం వాటికి ఉండదు. కనుక నైతికత వాటికి లేదు. అందుకే అవి పెండ్లి చేసికొనవు అయినను అవి పాపము చేయవు. ఏ జంతువులకి పక్షులకి దైవ చింతన ఉండదు. అవి చనిపోతే వాటి ప్రాణం, శరీరము మట్టిలో కలిసిపోతాయి. రోడ్డుమీద ఎన్నో జంతువులు చనిపోవటము మనము చూస్తాము కానీ ఎవ్వరూ వాటి గురించి పట్టించుకోరు కానీ ఒక మనిషి అతడు ఎంత పేదవాడైనా, యాచకుడైనా మరణిస్తే మాత్రం మనం అలా వదిలెయ్యలేము కదా! మానవుడు దేవుని పోలికలోనున్న శ్రేష్ఠమైన, విశిష్టమైన సృష్టి.

**మానవుడు - దైవచింతన :**

ప్రపంచంలో ఏ మారుమూల ప్రాంతములోనైనా ప్రతి ఒక్కరు ఏదో ఒక మతమును ఆచరిస్తూ దైవచింతన కలిగి యుంటారు. ప్రతి ఒక్కరు

మరణ భయం కలిగి, తమ పాపవిమోచన కొరకు, ముక్తి కొరకు ప్రయాసపడుతూ ఉంటారు. అందుకే అనేక పూజలు, పునస్కారములు, తీర్థ యాత్రలు చేస్తూ పుణ్యక్షేత్రాలు సందర్శిస్తూ అనేక పుణ్యకార్యాలు చేస్తూ ఉంటారు. అయితే వీటన్నిటి ద్వారా మానవుడు తన పాపముల నుండి విమోచన, ముక్తిని పొందగలడన్న నమ్మకం, ధైర్యం ఉందా ?

**మనిషి జన్మతః కర్మతః పాపి :**

నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు గ్రహించువాడు ఎవడును లేడు. దేవుని వెదకు వాడెవడును లేడు. మనందరికీ తెలిసిన " జానీ జానీ యస్పాప ఈటింగ్షు గర్నోపాప" అనే చిన్న పిల్లల రైమ్లోజానీ అనే పిల్లవాడికి చెక్కర దొంగతనం చేయమని, అబద్ధమాడమని ఎవరూ నేర్ప లేదు కదా ! మనిషి పాపం చేసాడు కాబట్టి పాపి కాదు మనిషి పుట్టుకతోనే పాపి అయి ఉన్నాడు. ఒకడు పాపము చేసిన యెడల పాపమునకు దాసుడు. మనుష్యుని హృదయము అన్నిటికంటె మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధికలది, దాని గ్రహింపగలవాడెవడు? హృదయములో నుండి దురాలోచనలును, జారత్వములును, దొంగతనములును, నరహత్యలును, వ్యభిచారములును, లోభములును, చెడుతనములును, దేవదూషణ, అహంభావమును, అవివేకములు, వచ్చి మనిషిని అపవిత్రం చేస్తాయి. న్యాయస్థానం ఒక దొంగను అతడు దొంగతనం చేసాడు కాబట్టి దొంగ అని అంటుంది. నిజానికి అతడు దొంగతనం అనే ప్రవృత్తి తన హృదయంలో పుట్టుకతోనే వుంది కాబట్టి దొంగతనం చేశాడు.

**పాపభారం - శిక్ష :**

పాపం మానవున్ని దేవుని నుండి దూరం చేసింది. ఈ పాపం దేవునికి మానవునికి మధ్య వైరం కలుగ చేసెను. నీతి, పరిశుద్ధత గల దేవుని ఉగ్రతకు మనలను గురి చేసింది. మానవుడు చేసే ప్రతి పాపం దేవునికి విరోధముగానే చేస్తున్నాడు. అన్నిటికంటే పాప భారం ఘోరమైనది. మానవుడు దాని నుండి తప్పించుకోవటానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాడు. పాపము వలన వచ్చు జీతం మరణం. అది నిత్య నరకం. మనుష్యులు ఒక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను. ఆ తరువాత తీర్పు జరుగును. మనిషి మరణించినప్పుడు, శరీరము మన్నయినది గనుక వెనుకటి వలెనే మరల భూమికి చేరును. ఆత్మ దాని దయ చేసిన దేవుని యొద్దకు మరల పోయి న్యాయమైన తీర్పు కొరకు ఆయన ఎదుట నిలబడును.

**మతం మనిషిని రక్షించ గలదా!? :**

మనుష్యుడు తన పాప భారము నుండి తప్పించుకోవటానికి పాప విమోచన కొరకు, నరకము నుండి తప్పించుకోవటానికి, ముక్తిని సంపాదించుకోవాలని అనేక స్వనీతి క్రియలు, పుణ్యకార్యాలు, దానధర్మాలు చేస్తూ మతమును అవలంబిస్తున్నాడు. అయితే అవేవి మానవున్ని దేవుని న్యాయమైన తీర్పు నుండి రక్షించలేవు. ఉదాహరణకు ఒక మనుష్యుడు తాను చేసిన నేరమును బట్టి ముద్దాయిగా న్యాయస్థానంలో ప్రవేశ పెట్టబడి చాలా కఠినమైన తీర్పునకు గురైయుండినప్పుడు ఆ మనుష్యుడు న్యాయమూర్తి ఎదుట తన నోరు తెరచి అయ్యా- నేను చిన్నతనం నుండి చాలా మంచి పనులు చేసాను, దొంగతనం చెయ్యలేదు, అబద్ధమాడలేదు, వ్యభిచరించలేదు, చాలా నీతిక్రియలను చేసాను, దానధర్మాలు చేసాను మరి ఏ తప్పు చేయలేదు

కనుక నన్ను విడిపించండి అని విన్నపము చేసుకొంటే అప్పుడు ఆ న్యాయమూర్తి ఆ నేరస్తున్ని తన నీతి క్రియలను బట్టి ఇప్పుడు విడిపిస్తాడా? మీరే చెప్పండి!

పాపము అనే ఊబిలోనున్న వ్యక్తి తనను తానే రక్షించుకోలేడు. అలాగే మతము, ధర్మశాస్త్రం, నీతిప్రభోదాలు, ప్రవచనాలు పాపపు ఊబిలో నున్న వ్యక్తిని రక్షించ లేవు. కనుక మనిషికి ఒక రక్షకుడు, ఒక ఆపన్న హస్తం అవసరం.

**దైవసహాయము :**

ఈ లోకంలో ప్రతి మానవుడు పాపములో పుట్టి పాపములోనే జీవిస్తూ పాపములోనే మరణిస్తున్నాడు. నీతిమంతుడు లేడు ఒక్కడును లేడు. ఎవడును ఏ విధము చేతనైనను తన సహోదరుని విమోచించలేడు. వాడు కుళ్ళు చూడక నిత్యము బ్రతుకునట్లు వాని నిమిత్తము దేవుని సన్నిధిని ప్రాయశ్చిత్తము చేయగలవాడు ఎవడును లేడు. వారి ప్రాణ విమోచన ధనము బహు గొప్పది. అది ఎన్నటికిని తీరక అట్లుండవలసినదే. ఒక గ్రుడ్డివాడు మరొక గ్రుడ్డివానికి త్రోవ చూపలేని విధంగా ఈ లోకంలో గురువులు, మహాత్ములు, మహర్షులు, గొప్పవారు అనబడే అనేకమంది ఉన్నను వారందరూ కూడా పాపములోనే పుట్టినవారు, పాపములేని వారు కారు కనుక వారెవరూ మానవున్ని తన పాపము నుండి రక్షించలేరు. మానవుని ప్రాణవిమోచన ధనం ఎవ్వరు చెల్లించలేనంత బహు గొప్పది.

అయితే ప్రేమ జాలి కనికరం గలిగిన దేవుడు మానవున్ని, పాపము నుండి విమోచించి నరకము నుండి రక్షించవలెనని అనాథిలోనే ఒక ప్రణాళికను రచించెను. నీతి న్యాయములు సింహాసనముగా గలిగిన దేవుడు

మానవుని యొక్క పాపము మీద తన ఉగ్రతను తృప్తిపరచుటకు ఆ పాపమును శిక్షించక తప్పదు. అయితే సమస్త మానవాళి పాపమును భరించి ఆ వెల చెల్లించుటకు సరియైన మానవుడు లేనందున దేవాది దేవుడే ఒక మానవునిగా, పాపరహితునిగా ఈ భూమి మీదకి రావలసిన అవసరం ఏర్పడింది.

**దేవుడు :**

అసలు దేవుడు ఎవరు? ఎలా ఉంటాడు? ఆయన గుణగణాలు ఏమిటి? ఒకసారి ఈ గొప్ప అంతరిక్షాన్ని, కోట్ల నక్షత్రాలను, గేలక్సీలను, ఈ అద్భుతమైన సృష్టిని చూస్తే ఆయన అదృశ్య లక్షణములు అనగా ఆయన నిత్య శక్తియు దేవత్వమును కొంత వరకు మనకు అవగతమౌతుంది. దేవుడు ఈ జగత్తును సృష్టించిన సృష్టికర్త అనగా సృష్టి వేరు సృష్టికర్త వేరు. సృష్టికర్త అయిన దేవుడు ఎప్పటికీ సృష్టి కంటే గొప్పవాడు. అత్యున్నత సింహాసనము కలిగి ఈ బ్రహ్మాండము కూడా పట్టజాలని గొప్ప దేవుడు మనుష్యుల హస్తకృతములైన ఈ ఆలయములలో నివసింపగలడా? మనుష్యుని చేతి పని కాగలడా?

దేవుడు ఆత్మ స్వరూపి కాదా ! దేవుడు జీవము గలిగిన వాడు మాట్లాడు వాడుగాను చూచుచున్న వాడుగాను తన బిడ్డల ప్రార్థనలు ఆలకించువాడు గాను ఉండాలి కదా. మానవుని కామ, క్రోధ, మధమాత్సర్యాలకు అతీతుడుగా ఉండి నీతి, పరిశుద్ధత, సత్యము, ప్రేమ కలిగిన సుగుణాల సంపన్నుడు కాదా !

సర్వాధికారియు, సర్వోన్నతుడు, సార్వభౌమాధికారి, సర్వశక్తి మంతుడుగాను, సమస్తమును ఎరిగినవాడుగాను, యుగయుగములు జీవించువాడుగాను, ఉన్నవాడు అనువాడుగాను, ఆది అంతము లేనివాడు

గాను ఉండాలి కదా! అంతేకాదు తన బిడ్డలైన మానవాళి రక్షన విమోచన కొరకు ప్రేమ, జాలి గలిగిన దేవుడు ఏదైనా చేసి యుండాలి కదా! దేవుడు ఒక్కడే. శరీరమునకు తండ్రి ఒక్కడే ఎలా ఉంటాడో మన ఆత్మలకు కూడా ఒక్కడే తండ్రి. అతడే మనందరినీ సృష్టించిన దేవుడు.

**దైవమానవుడు – విమోచనకార్యము :**

అతిక్రమములు, దోషములు, మరియు పాపముల వలన మానవుడు మరణము చేత బందింపబడి నిత్య నరకాగ్ని గుండములోనికి వెళ్ళుచుండగా ఈ మానవుని పాపము భరించి ప్రాణ విమోచన ధనం చెల్లించి పాప విమోచన చేసి రక్షించ గలిగే పాపరహితుడైన మానవుడు లేడు కనుక ఆ దేవాది దేవుడే మానవుని తరపున మరణించుటకు కాలము సంపూర్ణమైనప్పుడు సుమారు రెండు వేల సంవత్సరముల క్రితం కన్య మరియకి పరిశద్ధాత్మ వలన యేసు అను నామధేయుడిగా పుట్టెను. ఆయన పుట్టుకలో పాపం లేదు. ముప్పై మూడున్నర ఏళ్ళు ఈ లోకంలో పాపం లేని వాడుగా జీవించెను. ఆయనలో పాపముందని ఎవ్వరూ స్థాపించ లేకపోయారు. ఆయన పాపరహితుడు సర్వాధికారియు ప్రభువునగు దేవుడు. మనుష్యుల పోలికగా పుట్టి దాసుని స్వరూపమును ధరించుకొని తన్ను తానే రిక్తునిగా చేసుకొనెను. ఆయన దేవుడై యుండి తన సింహాసనమును, మహిమను విడచి పెట్టకూడని భాగ్యమని ఎంచుకొన లేదు. దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది. ఆయన అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆది సంభూతుడై యున్నాడు.

ఆయన దేవుని మహిమ యొక్క తేజస్సును ఆయన తత్వము యొక్క మూర్తిమంతమునై యుండి తన మహత్తు గల మాట చేత సమస్తమును

నిర్వహించుచు పాపముల విషయములో శుద్ధీకరణము తానే చేసెను. ఆయన ఆకారమందు మనుష్యునిగా కనబడి మరణము పొందునంతగా అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకొనెను.

యేసుక్రీస్తు మన పాపములను క్షమించు అధికారం కలిగిన దేవుడు. మన ఆరాధన అంగీకరించగలిగిన యోగ్యుడు, అర్హుడు. తన ప్రాణం పెట్టుటకును తిరిగి తీసుకొనుటకును అధికారం గలిగిన వాడు.

**ఒక మహాబలి - యజ్ఞం :**

రక్త ప్రోక్షణ లేకుండా పాప క్షమాపణ కలుగదని సామాన్యంగా చెప్పవచ్చును. అనేక మతాలలో పూర్వ కాలము నుండి బలులు, యజ్ఞ యాగాదులు చేయటము మనకు తెలుసు. ఎడ్ల రక్తము, గొర్రెల రక్తము మానవుని పాపాన్ని విమోచించ లేవు. అవన్నియు ప్రజాపతి అయిన ఆ దేవాది దేవుడే మానవునిగా అవతరించి తనకు తానే ఒక మహాబలిగా ఒక మహాయజ్ఞంగా తన ప్రాణమును అప్పగించి మానవాళి పాపవిమోచన కొరకు సిలువలో రక్తం చిందించి మరణిస్తాడు అనుదానికి ముంగుర్తుగాను సూచనగా మాత్రమే వున్నాయి.

యేసుక్రీస్తు నిన్ను ఎంతో ప్రేమిస్తున్నాడు. నిన్ను ప్రేమించి నీ కొరకు నీ పాప, దోష, అతిక్రమములను, శాపములను భరించి నీకు బదులుగా నీ స్థానము తీసుకొని నీ పక్షమున సిలువలో రక్తము కార్చి మరణించెను. యేసు రక్తము ప్రతి పాపమును కడిగి మనలను పవిత్రులనుగా చేయును.

**సిలువ త్యాగం :**

సిలువలో యేసుక్రీస్తు నిశ్చయముగా మన రోగములను భరించెను. మన వ్యసనములను వహించెను. మన అతిక్రమ క్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగ గొట్టబడెను. మన సమాదానార్థమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన దెబ్బల చేత స్వస్థత కలుగుచున్నది. మన అందరి దోషము అతని మీద మోపబడెను. అతడు దౌర్జన్యము నొందెను, బాధింపబడినను నోరు తెరువలేదు. వధకుతేబడు గొర్రెపిల్లయు, బొచ్చు కత్తిరించువాని యెదుట గొర్రెయు మౌనముగా నుండునట్లు అతడు నోరు తెరువలేదు. అన్యాయపు తీర్పు పొందినవాడై కొనిపోబడెను. నిశ్చయముగా అతడు అన్యాయము ఏమియు చేయలేదు. అతని నోట ఏ కపటము లేదు. ఆయన తన్ను తానే అపరాధ పరిహారార్థ బలి చేసెను.

నీకు ఆరోగ్యము మరియు స్వస్థత కలుగ చేయుటకు ఆయన గాయపరచబడెను. నిన్ను ధనవంతుడుగా చేయుటకు ఆయన దరిద్రుడాయెను, నీకు రక్షణ అనే నీతివస్త్రమును ఇచ్చుటకు సిలువలో ఆయన దిగంబరుడుగా మారెను. నీవు దేవుని నీతి అగునట్లు ఆయన సిలువలో పాపముగా చేయబడెను. నిన్ను ఆశీర్వాదముగా ఉంచుటకు ఆయన శాపముగా మారెను. యేసు అనగా రక్షకుడు అని అర్థం. ఆయనకి ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, బలవంతుడగు దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాదాన అధిపతి అని పేరు. ఆయన మనవలెనే ప్రతి శోధనగుండా

వెళ్ళి పాపము లేని వాడుగా ఉండి మన ప్రతి అక్కరలో, శోధనలో మనకు సహాయము చేయగలడు. ఆయనకి అసాధ్యమైనది ఏదియు లేదు. ఆయన సమస్తమును బాగు చేయును. యేసు నామములో దయ్యములు పారిపోవును.

ఆయనే నీ పరమ తండ్రి. నీ ప్రతి పరిస్థితి అయనకు తెలుసు. నీవు ఆయనని ఆశ్రయిస్తే తప్పక సాయం చేస్తాడు. ఆయన క్షమించలేని పాపం లేదు. నీ ప్రతి పాప భారమును అపరాధ భావమును తొలగించి నీకు మంచి మనస్సాక్షిని అనుగ్రహించును. ఆయన స్వస్థపరచలేని వ్యాధి, రోగం ఏదియు లేదు. కేవలము తన నోటి మాట చేత సమస్త సృష్టిని సృజించినవాడు పాడైన, చెడిపోయిన నీవు వెళ్ళుచున్న ప్రతి పరిస్థితిని బాగు చేయగలిగిన వాడు.

**ఖాళీ సమాధి :**

యేసుక్రీస్తు నీ కొరకు సిలువలో రక్తము కార్చి మరణించి సమాధి చేయబడి తిరిగి మూడవ దినమున పాపమును, మరణమును, పాతాళమును, సాతాను అంధకార శక్తులను, చెడిపోయిన మనిషి యొక్క ప్రాచీన స్వభావమును నాశనము చేసి విజయుడై పునరుత్థానుడయ్యెను. ప్రపంచ మానవ చరిత్రలో ఖాళీ సమాది కలిగిన ఏకైక పురుషోత్తముడు, పరిశుద్ధుడు అయిన యేసుక్రీస్తు దేవుడుగా మహిమతో ప్రభావముతో నిరూపించబడెను. ఆయన పరిశుద్ధుడు పాపము లేనివాడు కనుక మరణం ఆయనను బంధించి యుంచుట అసాధ్యము.

**యేసుక్రీస్తే ఎందుకు? (Why only Jesus Christ)?**

★ పాపరహితుడు (పుట్టుకలో, జీవితంలో పాపం లేదు).

★ పాపములను క్షమించు అధికారం గలిగినవాడు.

★ ఆరాధన స్వీకరించుటకు యోగ్యుడు, అర్హుడు.
★ ఆయన పరిశుద్ధుడు అని దయ్యములు సాక్ష్యమిచ్చెను.
★ లోకరక్షకుని గురించి ముందుగానే ప్రకటించిన 300 పైచిలుకు ప్రవచనాలు పరిశుద్ధ లేఖనాలలో క్రీస్తునందు నెరవేరెను.
★ మానవాళి పాపవిమోచన కొరకు మరణించిన ఏకైక దైవ మానవుడు.
★ మనుష్యుల పోలికగా పుట్టిన అదృశ్య దేవుని స్వరూపియై యుండి దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత కలిగిన దైవ మానవుడు.
★ నేనే మార్గము, సత్యము, జీవము అని ఉద్ఘాటించి, నా ద్వారా తప్ప ముక్తి లేదు అని చెప్పిన దైవమానవుడు.
★ చారిత్రక పురుషుడు. ఆయన పుట్టుక చరిత్రకి కేంద్ర బిందువు. ప్రపంచ చరిత్రను క్రీస్తు శకం–క్రీస్తు పూర్వంగా విభజించినవాడు.
★ ఒక చెంప మీద కొడితే ఇంకో చెంప చూపించు, నీ శత్రువులను ప్రేమించు, నిన్ను హింసించు వారి కొరకు ప్రార్థన చెయ్యి అని చెప్పిన ప్రేమ, క్షమాతత్వము కలిగిన ఆయన బోధలు అనేక పాపాత్ముల జీవితాలను మార్చెను.
★ ఖాళీ సమాధి గలిగిన ఏకైక వ్యక్తి (మరణమును, పాతాళమును జయించి తన యందు విశ్వాసముంచిన వారికి కూడా పునరుత్థానమున్నదని ఒక నిరీక్షణ కలుగజేసెను).

ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగా ఏ మనుష్యుడును ఆయన దృష్టికి నీతిమంతుడని తీర్చబడడు ధర్మశాస్త్రము వలన పాపమనగా ఎట్టిదో తెలియబడుచున్నది. ధర్మశాస్త్రమునకు వేరుగా దేవుని నీతి బయలుపడుచున్నది. అది యేసుక్రీస్తు నందలి విశ్వాస మూలమైనదై,

నమ్ము వారందరికి కలుగు దేవుని నీతియైయున్నది. కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తుయేసు నందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు.

**అందరికీ ఆహ్వానము - యేసు చెప్పెను :**

★ ప్రయాసపడి భారము మోయుచున్న సమస్త జనులారా నా యొద్దకు రండి నేను మీకు విశ్రాంతి నిచ్చెదను.

★ దప్పిగొనిన వారలారా నాయొద్దకు రండి నాయందు విశ్వాసముంచు వాని కడుపులో నుండి జీవజల నదులు పారును.

★ నా యొద్దకు వచ్చు వానిని నేనెంత మాత్రమును త్రోసి వేయను.

★ భూదిగంత వాసులారా నావైపు చూచి రక్షణ పొందుడి.

★ నేను శిక్షించుటకు, ఖండించుటకు రాలేదు గానీ నశించిన దానిని వెదకి రక్షించుటకే వచ్చియున్నాను.

★ నా యందు విశ్వాస ముంచువాడు మరణము నుండి జీవములోనికి దాటి యున్నాడు.

★ తల్లి తన చంటి బిడ్డను మరచినా మరచును గానీ నేను నిన్ను మరువను. చూడుము నేను నిన్ను నా అరచేతులలో చెక్కుకొనియున్నాను.

★ భయపడకుము నేను నీ దేవుడనైయున్నాను. దిగులుపడకుము నేను నిన్ను బలపరతును. నీకు సహాయము చేయు వాడను నేనే.

**దేవునితో వ్యక్తిగత సంబంధం :**

నీ సృష్టికర్త, నీ పరమ తండ్రి అయిన దేవునితో ఒక వ్యక్తిగత సంబంధం కలిగి యుండవచ్చు. ఆయన ఎవరికీ దూరంగా వుండువాడు కాదు. యేసుక్రీస్తును నమ్ముట ద్వారా నీ పాపము క్షమింపబడి నీవు ఆయన బిడ్డగా

వుండు అధికారము కలిగియుంటావు. ఆయన నీతో మాట్లాడాలని, నీ మాటలు ఆయన వినాలని ఎంతో ఆశగా వున్నాడు.

నీవు ఎవరైనా సరే ఏ కులమైనా, ఏ మతమైనా, నీ ఆర్థిక పరిస్తితి ఎలా వున్నా, నీవు ఎంత పాపివైనా నీవు ఆయన బిడ్డవే. ఆయనకి నీవు ఎంతో ప్రియమైనవాడవు. ఆయన తన రక్తం ఇచ్చి నిన్ను కొన్నాడు కనుక నీవు ఆయనకు ఎంతో విలువైనవాడవు. ఆయన నిన్ను ఎంతగానో కోరుకుంటున్నాడు. తన గాయపడిన హస్తములు చాచి నీ కోసం ఎదురుచూస్తున్నాడు. నీవు మోకరించి ప్రార్థించుట ద్వారా, పరిశుద్ధ బైబిల్ పఠనము ద్వారా దేవునితో ఒక అన్యోన్య సంబంధము కలిగి యుండవచ్చు. నీవు ఒంటరిగా వుండవలసిన అవసరం లేదు. ఆయన నీకు తోడు గావున్నాడు. నీ చింత యావత్తు ఆయన మీద వేయి. ఆయన నీ గురించి చింతించుచున్నాడు. నీ ప్రతి పరిస్థితికి చాలినవాడు. నిన్ను విడువడు ఎడబాయడు .

**రక్షణ పొందుటకు నేనేమి చెయ్యాలి ? :**

నేను ఒక పాపినని, ఆలోచనలలో, మాటలలో, క్రియలలో పాపం చేసానని ఒప్పుకొని నాకు ఒక రక్షకుడు అవసరమని గుర్తించి యేసును నీ సొంత రక్షకుడిగా, ప్రభువుగా నీ నోటితో ఒప్పుకొని నీ పాపము కొరకు యేసు సిలువలో రక్తము కార్చి, మరణించి తిరిగి మూడవ దినమున లేచాడని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు.

ఎందరైతే యేసుక్రీస్తుని అంగీకరించిరో వారందరూ దేవుని పిల్లలు అగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను. వారు మరణములో నుండి జీవములోనికి దాటి ముక్తిని పొందుకుంటారు.

**యేసుక్రీస్తుని అంగీకరించకపోతే! :**

ప్రతి మానవుడు మరణించిన తరువాత ప్రభువైన యేసుక్రీస్తు యొక్క ధవళ సింహాసనము ఎదుట ఆయన న్యాయమైన తీర్పు కోసం నిలువబడవలసి యుంది. ఎందరైతే యేసుక్రీస్తుని సొంత రక్షకునిగా అంగీకరించి పాప క్షమాపణ పొందియున్నారో వారికి యేసుప్రభువుతో యుగ యుగములు జీవించుటకు నిత్య జీవమును అనుగ్రహించును. అయితే ఒకవేళ నీవు యేసుక్రీస్తుని సొంత రక్షకునిగా అంగీకరించకుండా ఉండి పాప క్షమాపణ పొందకుండా నీవు నీ పాపములోనే ఉండి మరణిస్తే యేసుక్రీస్తు రక్తము చేత నీవు విమోచింపబడ లేదు కనుక నీవు ఒక రోజు ఖచ్చితంగా దేవుని న్యాయమైన తీర్పులోనికి రావలసి యుంటుంది. అది నిత్య నరకము. అక్కడ అగ్ని ఆరదు పురుగు చావదు.

**నీ జీవితంలో ఒక నూతన క్రియ :**

ప్రియమైన మిత్రమా! దేవుడు స్వయంగా ఈ పత్రిక ద్వారా మాట్లాడుతున్నాడు. జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన నిన్ను ఎన్నుకున్నాడు. ఆయన నీ జీవితంలో ఒక నూతన క్రియను ఆరంభించాడు. నీ పరిస్థితిని బాగుచేయుచున్నాడు. నీ కన్నీటిని ఆయన తుడుచుచున్నాడు. భయపడకుము. ధైర్యముగా వుండుము. దేవుడు నీ పక్షము నుండగా నీకు విరోధి ఎవడు. ఆయన నిన్ను నీ కుటుంబమును రక్షించును, బద్ర పరచును. నీ ప్రతి అక్కర ఆయన మహిమలో తీర్చును. కేవలము ఆయన వైపు చూడుము.

**ఇదే అనుకూల సమయము :**

ఇదే అనుకూల సమయము నేడే రక్షణ దినం. మనిషి జీవితం చాలా అనిశ్చితితో కూడుకొని గతించు నీడ వంటిది గాను నీటి ఆవిరి వంటిది గాను  ఉంది. ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియదు. రేపు అనేది మనది కాదు. ఈ పత్రిక నీ చేతిలోకి వచ్చింది అంటే యాదృచ్ఛికం కాదు. నా ప్రియమైన మిత్రమా యేసుక్రీస్తు నిన్ను ఎంతో ప్రేమిస్తున్నాడు. ఆయన ప్రేమతో నిన్ను తన నిత్య రాజ్యములోనికి ఆహ్వానిస్తున్నాడు. దయ చేసి కాదనకు. ఆయన పవిత్ర ప్రేమను త్రోసి వేయకు. ఆయన తన రెండు చేతులు చాచి నీ కోసం ఎదురు చూస్తున్నాడు. నిన్ను రక్షించాలని నిత్య నరకము నుండి నిన్ను తప్పించాలని నీ కొరకు సిలువలో రక్తం కార్చి తన ప్రాణమును సహితము నీ కోసం ధారపోసిన యేసుక్రీస్తు నీకు సమస్తమును దయ చేయగలడు. నీకు సహాయం చేయగలడు. నీ కుటుంబాన్ని ఆదుకోగలడు నిన్ను స్వస్థపరచగలడు. మేలుల చేత తృప్తి పరచగలడు. నిన్ను రక్షించగలడు. యేసుక్రీస్తు నీ హృదయమనే తలుపు నొద్ద నిలువబడి తట్టుచున్నాడు. నా ప్రియ మిత్రమా! నీవు తలుపు తెరచి ప్రభువైన యేసుక్రీస్తుని నీ హృదయంలోనికి ఆహ్వానిస్తావా?!

**గమనిక :**

ఇంకా ఎక్కువగా తెలుసుకోవాలని ఉంటే మీరు బైబిల్ యాప్‌ని గూగుల్ ప్లేస్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకొని చదవగలరు. పరిశుద్ధాత్మ ద్వారా వ్రాయబడి ప్రపంచంలోని అన్ని భాషలలోకి తర్జుమా చేయబడిన దేవుని పరిశుద్ధ గ్రంథము అయిన బైబిల్ని చదివి ప్రభువైన యేసుక్రీస్తు ప్రేమను రుచి చూసి తెలుసుకోవచ్చు